క్లుప్తంగా

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

మల్దకల్: గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు కాలనీలను ఈఓ మాబీ, సర్పంచ్ యాకోబులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మురుగు రోడ్లపై వదలకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చెత్తచెదారాన్ని పంచాయతీ ట్రాక్టరులో వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డుమెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధరూరు: మండల కేంద్రంలోని కుర్వ వీధిలో అనారోగ్యంతో బీఆర్‌ఎస్ నాయకుడు గవ్వల దర్శెల్లి, అలాగే కుర్వ బతుకన్నగారి సాయన్న శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్ మృతుల కుటుంబాలను పరామర్శించి దర్శెల్లి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ నర్సింహులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరుకు చెందిన వార్డు మెంబర్ కుర్వ శేఖర్ తండ్రి గోపాల్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ యువజన నాయకుబు ఆర్. కిశోర్ శుక్రవారం వల్లూరు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ గిడ్డారెడ్డి, నాగేష్, ఆనంద్, వెంకట్రాముడు, నాగన్న, గంగాధర్, రత్నం, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

21న సర్వసభ్య సమావేశం

మల్దకల్: ఈ నెల 21న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు శుక్రవారం ఎంపీడీఓ కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాజారెడ్డి అధ్యక్షతన ఉదయం11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు విధిగా హజరు కావాలని ఆయన కోరారు.

గద్వాల రూరల్: ఈ నెల 17న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీవో చెన్నయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన వహిస్తారని పేర్కొన్నారు. సకాలంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు హెచ్‌ఎంల..

ధరూరు: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించే విద్యా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ధరూరు, కేటీదొడ్డి మండలాల్లోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తునట్లు ఎంఈఓ సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాల కార్యాచరణ, ప్రణాళిక తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు వివరించారు. హెచ్‌ఎంలు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సీఐగా పదోన్నతి

గద్వాల క్రైం: గద్వాల పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రామస్వామికి సీఐగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పోలీసుశాఖ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. 2007, 2009 బ్యాచ్‌కు సంబంధించిన 125 మంది ఎస్‌ఐలకు పదోన్నతి లభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పోలీసులు, నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కేబుల్ వైర్లు చోరీ

ధరూరు: వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ మోటార్లకు ఉన్న విద్యుత్ కేబుల్ వైర్లు గురువారం రాత్రి చోరీకి గురైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని జాంపల్లి శివారులోని నెట్టెంపాడు కెనాల్ వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. 11 మోటార్ల వైరును ఎత్తికెళ్లినట్లు రైతులు పేర్కొన్నారు. దీంతో నారుమడులు చేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మండల కేంద్రంలోను దొంగతనాల బెడద తీవ్రంగా ఉందని రైతులు వాపోయారు. చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన కంటి వెలుగు

గట్టు: మండలంలోని మాచర్లలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరం శుక్రవారం ముగిసింది. గ్రామంలో మొత్తం 144 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, ఇందులో 5 మందికి అద్దాలను పంపిణీ చేయగా, 8 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు సీహెచ్‌ఓ ఊసేని తెలిపారు. వైద్యాధికారి సాయికిరణ్, స్వర్ణలత, పాల్గొన్నారు.

పాఠశాలలకు ప్రహరీలేవి...?

- బడి ఆవరణలో పశువుల సంచారం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మల్దకల్: ప్రభుత్వ బడుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంతో ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మండల కేంద్రంలో కొన్ని పాఠశాలలో తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. అధికారుల మాటలకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితికి పొంతన లేకుండా పోతోందని విమర్శలు వినిపిస్తున్నారు. కనీసం ప్రహరీలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు లక్షలు వెచ్చించి పాఠశాలలను నిర్మిస్తున్నా ప్రహరీలు నిర్మించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆవరణలో పశువులు, పందులు సంచరించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాలు ఇలా..

మల్దకల్, గట్టు, కేటీదొడ్డి, ధరూరు, గద్వాల మండలాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేవు. మల్దకల్ మండలంలో మొత్తం 10 జెడ్పీహెచ్‌ఎస్, నాలుగు యూపీఎస్, 27 పీఎస్‌లు ఉండగా వాటిలో 6248 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. వీటిలో కొన్ని పాఠశాలలను నూతనంగా లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించిన వాటికి ప్రహరీలు నిర్మించకపోవడంతో ఆవరణలంతా అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. నాగర్‌దొడ్డి, నీలిపల్లి, ఎద్దులగూడెం, దాసరపల్లి, బిజ్వారం, చిప్పదొడ్డి, విఠలాపురం, గ్రామాల్లోని పాఠశాలలతో పాటు మల్దకల్ కస్తూర్బా పాఠశాలకు ప్రహరీలు నిర్మించలేదు. వర్షాకాలంలో వర్షపునీరు పాఠశాల ఆవరణలోకి చేరి అపరిశుభ్రంగా కనిపిస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. అదేవిధంగా కస్తూర్బా బాలికల పాఠశాలతో పాటు ఎద్దులగూడెం, బిజ్వారం పాఠశాలల ఆవరణ ముందు ప్రధాన రహదారులు ఉండటంతో విద్యార్థులు ఎప్పుడు రహదారుల పైకి వెళ్లి ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీలు లేని పాఠశాలలకు ప్రహరీలు, గేట్లు లేని పాఠశాలలకు గేట్లు అమర్చి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



ప్రహరీ లేని మల్దకల్ కస్తూర్బా బాలికల పాఠశాల

ఉన్నతాధికారులకు నివేదించాం

పాఠశాలలకు ప్రహరీలు లేని విషయం వాస్తవమే. సంబంధిత పాఠశాలను సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నాం. ప్రహరీల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే ప్రహరీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటా.

– ఇన్‌చార్జ్ ఎంఈఓ, కొండారెడ్డి

ప్రహరీ నిర్మించాలి



మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలోకి పశువులు, గొర్రెలు, పందులు ప్రవేశిస్తున్నాయి. ఆవరణ మొత్తం అపరిశుభ్రం చేస్తున్నాయి. ప్రహరీ నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– బ్రహ్మోజీరావు, మల్దకల్

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



నాగర్‌దొడ్డిలో ప్రభుత్వం కొత్తగా నిర్మించిన పాఠశాల భవనానికి ప్రహరీ నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. లక్షలు వెచ్చించి పాఠశాల భవనాన్ని నిర్మించారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– సోమన్న, నాగర్‌దొడ్డి

సమస్యను పరిష్కరించాలి



పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారి ఉండటంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అలాగే మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో పాఠశాల విద్యార్థులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

– బుడ్డన్న, కుర్తిరావల్‌చెర్వు

మౌలిక వసతులపై కలిసి కట్టుగా కృషి చేద్దాం



మాట్లాడుతున్న హనిమి రెడ్డి

రాజోళి: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమి రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. బడిబాటలో విద్యార్థులను చేర్పడంలో ఉపాధ్యాయులు, సిబ్బందే కాకుండా ఎస్‌ఎంసీ చైర్మన్లు కూడా కీలకంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను, ఉత్తీర్ణత శాతాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. భోజనం, తాగునీరు, టాయిలెట్స్, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించి తరుచూ సమావేశాల్లో చర్చించుకుని సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నిర్మలా జ్యోతి, పెద్దింటి నాగేష్, ఆయా గ్రామ పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

శాంతినగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యావని, దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోషయ్య కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో యాప్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అధ్యాపక బృందంతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. కళాశాలలో విద్యార్థులు చేరి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ, బీజెడ్‌సీ విభాగాలలో ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి



నారాయణపురంలో వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

మానవపాడు: పీఎం కిసాన్ లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ సక్రియనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో ఈ-కేవైసీ నమోదు చేసి ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ కావాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్ అనుసంధానం తప్పనిసరి అని పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన వివరించారు. కార్యక్రమంలో ఏఓ సుబ్బారెడ్డి, సిబ్బంది, రైతుల తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

కేటీదొడ్డి: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో వేణురెడ్డి తదితరులు ఉన్నారు.

23న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం..

గద్వాల వ్యవసాయం: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు కోసం ఈనెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి షకీలాభానో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాలోని అన్ని మత్స్య పారిశ్రామిక సంఘాల, మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల, మత్స్య మార్కెటింగ్ సహకార అధ్యక్షులు హాజరు కావాలని కోరారు. సభ్యత్వం పొందిన వారు తాత్కాలిక కార్యవర్గ కమిటీని ఎన్నుకొని, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట



వార్డు కౌన్సిలర్ గిత్తల దేవన్నకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపేట వేసిందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వహించిన పట్టణ ప్రగతికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో ముగ్గుల పోటీలను తిలకించారు. అనంతరం కర్నూలు–రాయచూరు రోడ్డు సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, మానవహారం ఏర్పాడ్డారు. పట్టణ ప్రగతి థీం సాంగ్‌ను ఆలపించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంవద్ద జెండా ఆవిష్కరించారు. అదేవిధంగా వివిధ కేటగిరీల వారీగా ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆర్‌పీలు, ఉద్యమకారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

అలంపూర్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ చౌక్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ ప్రజలతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. మున్సిపల్ సిబ్బందికి రెండు జతల బట్టలను పంపిణీ చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 25 కోట్ల నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు నాగలక్ష్మి, సకినాబి, అల్లబఖష్, బత్కయ్య, స్థానిక నాయకులు మోహన్ రెడ్డి, జితేందర్ గౌడ్, వెంకట్రామయ్య శెట్టి, పోలీస్ చెన్నయ్య, వెంకట్ రెడ్డి, విజయ కుమార్ రెడ్డి, హర్షద్, కృష్ణమ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానం

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలని శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, ఈఓ పురేందర్ కుమార్‌లు ఆహ్వానించారు. ఈ నెల 21న అలంపూర్ క్షేత్రంలో నిర్వహించే తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవంలో పాల్గొనాలని కోరారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో పట్టణ ప్రగతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

అలంపూర్: పొరపాట్లకు తావివ్వకుండా ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గ బూత్ స్థాయి అధికారుల సమావేశాన్ని ఆర్డీఓ రాములు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి అదనపు కలెక్టర్, డీడబ్ల్యూఓ ముషాహిదాబేగం, తహసీల్దార్లు, ఎంపీడీఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేయడమే ప్రభుత్వం లక్ష్యం అన్నారు. గతేడాది మే 1వ తేదీ నుంచి ఈ ఏడాది మే 1వ తేదీ వరకు నియోజకవర్గంలో 9023 తొలగించినట్లు పేర్కొన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేసి లోపాలు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. ప్రతి రోజు బీఎల్‌ఓలు 150 ఇళ్లను సర్వే చేసి వివరాలు నమోదు చేయాలని కోరారు. ప్రతి బీఎల్‌ఓ గరుడ యాప్‌ను తమ మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసి వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఓటు తొలగింపును కుటుంబ సభ్యుల ప్రతిపాదన, మరణ ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. నిర్ధారణ తర్వాత ఫాం–7 ద్వారా ఓటును తొలగించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులకు ఫాం–6 ద్వారా ఓటు హక్కు నమోదు చేపట్టాలని వివరించారు. ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు నమోదై ఉంటే ఆ వ్యక్తి ప్రతిపాదనతో అవసరమైన చోట ఉంచి అవసరం లేనిచోట తొలగించాలన్నారు. వీటితోపాటు నియోజకర్గంలో ఉన్న 259 మంది బీఎల్‌ఓలు వారి వారి పోలింగ్ కేంద్రాల భవనాల పరిస్థితి, విద్యుత్, ర్యాంపులు, నీటి వసతి వంటి అంశాలను పరిశీలించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. మరణ ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఓటు హక్కు తొలగించిన 22 మంది బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కలెక్టర్ ఆర్డీఓ రాములుకు సూచించారు. తహసీల్దార్లు ఓటరు జాబితాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో సీడీపీఓ సుజాత, తహసీల్దార్‌లు లక్ష్మి, సుభాష్ నాయుడు, వీరభద్రప్ప, సుబ్రమణ్యం, జోషి శ్రీనివాస శర్మ, వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓలు, ఎంపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు.

మల్దకల్: పకడ్బందీగా ఓటరు జాబితా తయారుచేయాలని తహసీల్దార్ హరికృష్ణ బీఎల్‌ఓలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించడంతో పాటు కొత్తగా వివాహాలు అయినా వారి పేర్లను నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫోన్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామకృష్ణ, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు ఆర్థిక సాయం అందించాలి

అయిజ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం బీసీలోని అన్ని కులాలకు వర్తింపజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వాల్మీకి, బోయలు ఎక్కువ శాతం ఉండటంతో అందరికి ఆర్థిక సాయం అందజేస్తే బాగుంటుందన్నారు. గతంలో బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు ఉలుకు పలుకు లేకుండా ఉన్నారని విమర్శించారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు కొమ్ముకాసే వారికే దళిత బంధు అందజేస్తున్నారని ఆరోపించారు. బీసీలో ఉన్న అన్ని కులాలకు ఆర్థిక సాయం అందించకుంటే బీజేపీ తరుపున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మెడికల్ తిరుమల్‌రెడ్డి, మాదన్న, భీంసేన్‌రావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి



స్వామితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సద్గురు గుడికల్లు అల్లీపీరా స్వాములు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దొడ్డిలో గుడికల్లు అల్లీపీరా స్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, రాజు, రాములు, మధు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

గట్టు: మండలంలోని యల్లందొడ్డి ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని ఎంపీపీ విజయ్ కుమార్, సర్పంచ్ రాధిక భర్త గోవిందు శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో 5వ తరగతి వరకు పాఠశాలలో విద్యను అభ్యసించిన తర్వాత ఉన్నత చదువులకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చాలా మంది విద్యార్థులు మధ్యలోనే బడి మానేస్తున్నారని వివరించారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని విన్నవించారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

అయిజ: ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని బీపీ ఆపరేటర్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు ఏఎన్‌ఎంలకు సూచించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ విష్ణు, డాక్టర్ మానసలతో కలిసి ఏఎన్‌ఎంలకు బీపీ ఆపరేటర్ మిషన్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలు పైబడిన వారందరికి స్క్రీనింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ శ్యాంసుందర్, సూపర్‌వైజర్ మక్బుద్, ఎంపీహెచ్‌ఈఓ ఓబులేశ్వరయ్య, సూపర్‌వైజర్లు శోభారాణి, నిర్మల, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

19న హరిత మహోత్సవం

అలంపూర్: అందరి సహకారంతో హరిత మహోత్సవం నిర్వహించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఈజీఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19వ తేదీన నిర్వహించే హరిత మహోత్సవం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

శాంతినగర్: ఈ నెల 19న నిర్వహించే హరితోత్సవంలో ప్రతి గ్రామ పంచాయతీలో 200 మొక్కలు తప్పనిసరిగా నాటాలని ఎంపీడీఓ రవీంద్ర సూచించారు. వడ్డేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీఓ విజయలలిత, ఎంపీఓ తిరుపతన్న, టెక్నికల్ అసిస్టెంట్ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈఓ హాజరై కొత్త అడ్మిషన్స్‌పై చర్చించారు. కొత్త అడ్మిషన్లు తక్కువగా ఉన్న ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న విద్యా దినోత్సవం నిర్వహించాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హేమలత, బాలజీకృష్ణ కుమార్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ సాయిప్రకాష్ నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అబ్రహం హాజరయ్యారు. ముందుగా ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. పులికల్ రోడ్డు నిర్మాణం చేపట్టి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణం పనులు పూర్తికాలేదని ఉప్పల ఎంపీటీసీ ప్రహ్లాద రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయకుంటే గ్రామాల్లో ప్రజాప్రతినిధులు తిరిగే పరిస్థితి లేదని కోఆప్షన్ మెంబర్ చాంద్‌బాషా పేర్కొన్నారు. ఎంపీటీసీ, కోఆప్షన్ మెంబర్లు ఎమ్మెల్యేతో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తొలగించామని, రెండో కాంట్రాక్టర్‌కు హార్ట్ ఎటాక్ వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మానవపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం హైదరాబాద్ చెందిన వినయ్ బైక్‌పై వివిధ పనుల నిమిత్తం కర్నూల్ మీదుగా గండికోటకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మానవపాడు శివారు ప్రాంతంలోని జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో వినయ్ గాయపడగా హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.